


# భామాయణం

**సత్య**-సత్యభామల వివాహం వైభవంగా జరిగింది. ఆ రాత్రి నవవధూవరుల ప్రథమ సమాగమం. ప్రేయసీప్రియులు ప్రథమ ప్రణయసోపానంమీద అడుగు పెట్టారు. కొన్ని వందల రోజులనుండి వారిలో పెరుగుతూవచ్చిన ఆకర్షణకిది ఉత్కర్ష. నవ యువతీ యువకుల దాంపత్య జీవితానికిది నాంది. మధుర భావాలతో వారి మనసులు స్పందిస్తున్నాయి. నవ యౌవనశోభ వారి ప్రత్యంగంలోను ప్రతిఫలిస్తోంది. వారి దాంపత్య జీవితంలో మధుర సన్నివేశాలకిది మొదలు. ఇంతకుముందు వారు ఆకర్షణ అంటే యేమిటో తెలిసికొన్నారు. మోహమనే మైకంతో ఊగిసలాడారు. ఇప్పుడా మత్తులో చైతన్య ముదయించింది. ఏదో

రసానుభూతికోసం తహతహలాడుతూ న్నట్టు వారి చూపులూ చేష్టలూ సూచిస్తు న్నాయి.

"భామా, ఒక్కసారి యిటుతిరిగి నన్ను చూడవూ? అబ్బ, నిన్నటివరకూ చెట్టపట్టాలు పట్టి నాతో విహరించిన దానవు; ఇప్పుడింతలో సిగ్గుపడతా వెందుకూ?" అంటూ సత్యరాయణి సత్యభామను సమీపించాడు. వెనుకనుండి ఆమె భుజాలమీద చేతులువేసి ఆమెను తనవైపుకి తిప్పుకున్నాడు. మునివేళ్లతో ఆమె చిబుకాన్నెత్తాడు. గదిలో పైన వెలుగుతూన్న కృత్రిమ చంద్రుని కాంతిలో సత్యభామ కన్నులు నీళ్లల్లోని చేపల్లా మెరిశాయి కృత్రిమ మలయ మారుతాన్ని సృష్టిస్తూన్న పంకా ఆమె ముంగురుల్ని ఒకసారి ఆమె ముఖంమీద ఆడించి చెంపలమీదికి చేర్చింది. రెండు చెమటబిందువులు మిలమిల్లాడుతూ ఆమె చెక్కిళ్లమీదనుండి జారిపడ్డాయి.

"ఏదీ, ఒక్కసారి నోరువిప్పి మాట్లాడవా?" అంటూ కాంక్షతో ఆమె కన్నుల్లోకి చూచాడు సత్యరాయణి.

"సత్యా!" అంది మోహపుమైకంతో సత్యభామ. మామిడి చిగుళ్లలా ఆమె పెద వులు కంపించాయి.

"ఇంకా సిగ్గేమిటి భామా? నీ మనసు లోని మాటల్ని మీటు. ఆ స్వర మాధు ర్యంతో నా వీనులకు విందుచెయ్యి!"

"కవిత్వం గానం చేస్తున్నావే?" అంది సన్నగా తల ఒంచుకొని ఓర చూపుతో.

"ఇటువంటి మధుర సన్నివేశంలో కూడా కవిత్వం ఉత్పన్నంకానివాడు జడుడు జంతువుకంటే హీనుడు ...ఏదీ, మరొకసారి నా కళ్ళల్లోకి చూస్తూ 'సత్యా' అనిపిలవ్వూ?"

ఈ మాటవిని మెల్లగా కిలకిల నవ్వింది సత్యభామ

"ఏం? కితకితలు పెట్టినట్టు నవ్వు తున్నావ్?" అన్నాడు.

"నీ పేరు!..."


"నా పేరా? ఏం? నా పేరులో నీకు వింతేమి తోచింది? అనేక వందలసార్లు నువ్వు పిలిచిన పేరేగా?"

"కాని ఇప్పుడు ఆడదానిపేరని పిస్తోంది"

"సరిసరి!ఐతే నేనిప్పుడు నిజంగా ఆడదాన్నైపోతే ఏంచేస్తావో?"

"మీ అన్నను వరిస్తా!"

"హరి భగవంతుడా! ఒక్కరాత్రి కూడా గడవకుండానే పాతవాణ్ణయి పోయానా? మెల్లిగా మెత్తగా ప్రతిమాలితే ఇలాగే ఆడదానికి అలుసైపోతాడు మగాడు. మూడువందల ముప్పైరోజుల నుండి నాలోని మోహపుకోరికల్ని పాలనిపొంగించినట్టు పొంగించి, చివరికి మధురఘడియల్లో మజ్జిగచుక్కల్లాంటి మాటలతో గడ్డకట్టిద్దా మనుకున్నావా? అదెంతమాత్రం సాగనివ్వను. నీ




సౌందర్య రసశర్కరను నా మోహంపు పాలతో కలిపి పాలకోవా తయారుచేసుకుంటాను" అంటూ సత్యరాయణి సత్యభామను అమాంతం కౌగలించుకున్నాడు. గాఢంగా తన వక్షానికి ఆమె నడుము కున్నాడు. రెచ్చిపోతున్న తమకంతో ఆమె పెదిమల్ని, కన్నుల్ని, నుదుటిని, చెక్కిళ్లని పదేపదే చుంబించాడు.

"అబ్బా, గుచ్చుకొంటోంది!" అని బలవంతంగా పట్టు వదిలించుకొని రెండడుగులు వెనక్కివేసింది సత్యభామ గోధుమ త్రాచు కుబుసంలా పల్చగా మినమిసలాడుతూన్న పమిట కొంగు రాయణిచేతుల్లోకి వచ్చేసింది తన వక్షోజాల మధ్యభాగాన్ని ఒకసారి చేతితో నిమురుకొని, అక్కడే వ్రేలాడుతూన్న బంగారు పతకాన్ని చూపుతూ "ఇది గుచ్చుకపోయింది, అంత గట్టిగా నొక్కిపిండేస్తే..." అంటూ పమిట కొంగు తీసుకొనబోయింది.

పడగవిప్పిన సర్పాన్ని హఠాత్తుగా చూసినట్టు ఎలక్ట్రిక్ షాక్ తిన్నట్టు ఆమె మెళ్లోని పతకాన్ని చూసి చలించిపోయాడు సత్యరాయణి. రెండడుగులు వెనక్కివేశాడు లాక్కొంటూన్న పమిట చెంగును గట్టిగా పట్టుకొని "ఆగు! అది ...అది..." అంటూ చూపుడు వ్రేలితో చూపిస్తూ తప్ప తప్పగా అంటున్నాడు.

పమిటచెంగు వదలకపోవడం, పైగా చూపుడు వ్రేలితో తన వక్షాన్ని లక్ష్యంగా చూపడంతో భామకి ఒళ్లంతా గిలిగింతలు పెట్టినట్లయింది. లజ్జాభావంతో కుంచించకపోయి చేతులు కట్టుకొని వక్షాన్ని బిగించుకొని నిలబడిపోయింది యౌవన మధువును చిత్తుగా త్రాగి ఏపుగా బలిసి వయసు సొగసుతో మిడిసిపడుతూన్న వక్షోజాలు, ఆమె చేతులు కట్టుకొనడంతో ఉవ్వెత్తుగా పొంగాయి, చక్రవాకాల్లా. పుట్టల మధ్య లేచిన సర్పంలా పతకం ఆమె కంఠంనుండి సన్నని బంగారు

గొలుసుతో ఆమె వక్షంమీద వ్రేలాడుతోంది. "అబ్బా, చాల్లెద్దూ, గుచ్చి గుచ్చి అలా చూపులతో కితకితలు పెట్టేస్తున్నావేమిటీ? కొంగు వదులమ్మా నీకు పుణ్యముంటుంది!" అని తలెత్తకుండా కళ్ళనుమాత్రం కదుపుతూ అంది సత్యభామ.

సత్యరాయణి ముఖంలో పూర్తిగా ఆందోళన వ్యక్తమౌతోంది. చూపుడు వ్రేలు ఇంకా అలాగేచూపిస్తూఉంది. "ఆ పతకం అది నీదేనా?"అన్నాడు కంపిత స్వరంతో గుటకలు మింగుతూ.

"ఆఁ, అచ్చంగా నూటికి నూరుపాళ్ళు ఇది నా స్వంతం. ఏం, అంత బాగుందా? అలా ఎడంగా పోయావేం? ఇలా రా, చేత్తో పట్టుకొని చూడూ!" అంటూ కట్టుకున్న చేతులు వదిలింది. చక్రవాకాలు రెండూ రెండు చిరుగెంతులువేసి నిల్చాయి. మూన్‌లైటు కాంతిలో పతకం తళుక్కుమని మెరిసింది.

"ఏదీ! అది తీసియ్యి!" అన్నాడు సత్యరాయణి ఉన్నచోటనే నిలబడి. తన చేతుల్లోఉన్న పమిటకొంగును జారవిడిచాడు.

వానివైపు దొంగచూపులు చూస్తూ కొంచెంవంగి పమిటకొంగు తీసి వేసుకుంది భామ. ముసి ముసి నవ్వుతో చిన్నగా నిట్టూర్చింది. వానివైపుకి అడుగులువేస్తూ పతకం తీసి వాని చేతిలో పెట్టింది.

కంపిస్తూన్న వ్రేళ్ళతో పతకం తిరగామరగావేసి పరిశీలించాడు రాయణి వాని ముఖం వెలవెల బోయింది చివాలున వెనక్కి నడిచి ప్రక్కనున్న గదితలుపు తెరచి లోపలికి వెళ్ళాడు.

"ఏం సత్యా, అలా కలవరపడుతున్నావేమిటీ?" అంటూ వాని వెనుకనే ప్రక్కగదిలోకి వెళ్ళింది భామ.

తన సూట్‌కేసు తెరచి బట్టల అడుగు నుండి తెల్లని దంతపు భరిణతీశాడు సత్య. మూత తెరచి అచ్చంగా దానిని పోలిన పతకాన్ని పైకితీసిపరిశీలించాడు. భరిణలాగే రెండు డిప్పలు కలిసి తయారైన పతకాలవి. గోటితో అదిమి రెండు పతకాల డిప్పలను విడదీశాడు. లోపల పసిడిరేకులమీద పద్మంవంటి గీతలతో బీజాక్షరాలు చెక్కబడి ఉన్నాయి. గీతలలోగాని అక్షరాలలోగాని రెండు పసిడిరేకులకి భేదం లేదు. వాటి నలాగే చేతుల్లో పెట్టుకొని తలెత్తి కళ్ళు గట్టిగా మూసుకొని దీర్ఘంగా నిట్టూర్చాడు. వాని ముఖమంతా చెమట చిమ్ముకుంది.

సత్యభామ ఇదంతా అయోమయంగా చూస్తూ వాని ప్రక్కను నిలబడింది. కొన్ని క్షణాలు ఎవరి నోటానూ మాట వెలువడలేదు. ఇంక నిలబడలేక కాబోలు రాయణి తూలుతూవచ్చి సోఫాలో కూలబడ్డాడు.

"ఏమిటి సత్యా? అలా అయిపోయావేం? ఆ పతకం నీ కెక్కడిది? రెండూ ఒక్కలాగే ఉన్నాయేమిటి?" అంటూ ఆత్రంతోను ఆందోళనతోను వాని ముందు నిలబడి ప్రశ్నించింది భామ.

"భామా! నువ్వెవరవు?" అని ప్రశ్నించాడు సత్య.

"అంటే?" అంది ఆశ్చర్యంగా భామ.

"నీ జన్మస్థానం?"

"దివాణం తోట అని తూర్పుగోదావరి జిల్లాలో ఉంది మా స్వగ్రామం."

అవయవాలన్నీ పట్టు తప్పినట్టు సోఫాలోపడియున్న సత్య లేచి కూర్చున్నాడు. "మీ తండ్రి పేరు?'' అని మళ్ళీ ప్రశ్నించాడు.

"సత్యవరప్రసాదరాయణి అనే జమీందారు. వారిని నేనెరుగను. నా రెండవయేటనే నన్నూ మా అమ్మనూ విడిచి ఎక్కడికో వెళ్ళిపోయారుట.''

చివాలున లేచి నిలబడి "మరి, మీ ...మీ అమ్మా...?" అని ఆందోళనతోను ఆవేదనతోను అడిగాడు సత్య.

"మీనాక్షీదేవి?'' అని సందేహంతోను ఆశ్చర్యంతోను భయంతోను వాని ముఖంలోకి చూస్తూ చెప్పింది భామ

"ఘోరం! ... భామా ... మోసం జరిగిపోయింది? మనం సర్వనాశనమై పోయాం!" అంటూ రెండుచేతులతోను ముఖం మూసుకొని సోఫాలోకి కుప్పలా కూలిపోయాడు సత్య.

సత్యభామ కొన్ని క్షణాలు నిశ్చేష్టురాలై పోయింది. పిమ్మట భయంతోను ఆందోళనతోను "ఏం జరిగింది?" అని అడిగింది ఊపిరి బిగబట్టుకొని

"అమ్మా...!" అని దుఃఖంతో కూడిన బాధతో మూలిగి "ఏది కలియుగ ఘోరమో అది జరిగింది. మనస్సుతో ఊహించరానిదీ నోటితో చెప్పరానిదీ అక్రమకార్యం జరిగింది! అన్నా చెల్లెళ్ళకి పెళ్ళి జరిగిందమ్మా!'' అంటూ దుఃఖంతో బొంగురువోయిన కంఠంతో చేతుల్లో ముఖం పెట్టుకొని అన్నాడు సత్య.

"ఆఁ!" అంటూ సత్యభామ నిలువునా కంపించిపోతూ వాని కెదురుగా ఉన్న కుషన్ కుర్చీలో కూలబడిపోయింది. "ఐతే...నువ్వు ... నువ్వు?" అని వ్రేలితో చూపుతూ కంపిత స్వరంతో అడిగింది.

"ఆఁ! నేను...నేనే...నీ అన్నను! ...సత్యవరప్రసాదరాయణిగారి కుమారుణ్ణి. మీనాక్షీదేవిగారికి దూరమైన కన్నబిడ్డని!" అన్నాడు అణమకొంటూన్న దుఃఖంతో.

"అన్నా! నాకు ఒక 'అన్న' ఉన్నట్టు అమ్మ యెప్పుడూ చెప్పనేలేదే! నువ్వు నాకు అన్నయ్యవా? అయ్యో భగవంతుడా! ఎంత తప్పుపని జరిగిపో

యింది!" అని వెర్రిగా వానికేసి చూస్తూ కన్నీరు కార్చింది భామ. ఇంక కదలలేక వానివైపు చూడలేక కుర్చీచేతిమీద తల వాల్చి వెక్కి వెక్కి యేడువసాగింది.

ఇలా వాళ్ళిద్దరూ ఎవరి చోట వాళ్ళు పడియుండి బావురుమని బిగ్గరగా యేడ్చే అవకాశంలేక లోలోపల రోదించారు.

ఒక అరగంట గడిచింది. గోడగడియారం ఠంగు ఠంగున పదకొండు గంటలు కొట్టింది.

"మరి నాన్నగారు ఎక్కడ ఉన్నారు?" అని అడిగింది భామ

"ఇంకెక్కడి నాన్నగారు? వారు ఆ నాడే, ఇల్లువిడిచిన ఒక సంవత్సరానికే స్వర్గస్థులయ్యారు," అన్నాడు గద్గద కంఠంతో.

తండ్రిని తాను ఎరుగకపోయినా ఆయన ఎక్కడో జీవించే ఉన్నారనే భావంతో ఉన్న సత్యభామ ఆయన మరణవార్త విని దుఃఖించింది. కొంత సేపటికి స్థిమితపడి లేచింది హాలువైపున ఉన్న ద్వారం దగ్గిరకి నడిచింది. తలుపు గడియ తీయబోయింది.

''ఆగు! ఎక్కడికి?'' అన్నాడు సత్య ఉలికిపడినవానిలా.

''అమ్మదగ్గరకి''

"తొందరపడకమ్మా! ఇప్పుడీ సంగతి ఎవరికి తెలిసినా మన జీవితాలు అధోగతిపాలౌతాయి. నాకంటే ఎక్కువగా నువ్వు సర్వనాశన మౌతావు!"

"అదేమిటన్నయ్యా! నాన్నగారు పోయిన సంగతి విని దుఃఖించినా, ఏనాడో పసితనంలో తనకు దూరమైన బిడ్డను పొంది అమ్మ ఆనందపరవశురాలౌతుంది!"


"అది సరే, కాని ఇంక ఈ జీవితానికి నీకు వరుడు దొరకడం, సక్రమమైన వివాహం జరగడం అసంభవం!"

"ఇది తెలియక జరిగిన పొరబాటు గదా?"

"తెలిసి జరిగినా తెలియక జరిగినా నీకు వివాహమైపోయింది —— అంత మాత్రమే తెలుసు లోకానికి. పైగా-ఒళ్లు పొగరెక్కి కళ్ళు మూసుకపోయి అక్రమ దాంపత్యం యేర్పరచుకొన్నారని కాకుల్లా అరుస్తారు, గ్రద్దల్లా పొడిచేస్తారు లోకులు! మన గౌరవప్రతిష్ఠలు నాశనమవడమేగాక మనమీ లోకంలో జీవించే అవకాశమే కోల్పోతాము అప్పుడింక ఆత్మహత్య తప్ప వేరు మార్గముండదు. ఆత్మహత్య చేసుకున్నా మన గౌరవం మనకి తిరిగిరాదు సరిగదా మన వంశం శాశ్వతమైన కళంకంతో రూపు మాసిపోతుంది. అంచేత ఈ సంగతి మన యిద్దరిలోనే మరుగుపడి ఉండాలి!"

"ఐతే నీ ఉద్దేశం?'' అంది కొంచెం చురుకుగా సత్యభామ.

"మరేమీలేదు చెల్లీ! నిదానంగా ధైర్యంతో ఈ విషమపరిస్థితిని తొలగించుకోవాలి! అందుకు కొంతకాలం




పడుతుంది. అంతవరకూ మనమిలాగే రోజులు గడపాలి."

"అది నా వల్లగాదు. నువ్వు నాకు అన్నవనీ నీకు నేను చెల్లెలిననీ మన మిద్దరం ఒకే తల్లి గర్భాన జన్మించిన వారమనీ ధృవపడిన తరువాతకూడా భార్యాభర్తల్లా నటించమంటావా? ఛీ! ఇంతకంటె నీచమైన పని వేరొకటి ఉందా?"

"ఐతే రెండు నిండుజీవితాలు నాశనం చేసుకుంటామా?''

"ఇంతకంటె అదే మంచిదంటాను!"

"ఇంక జీవించడ మెందుకూ?"

"అనవసరం. ఆత్మహత్య చేసుకుందాం!''

"అందువల్ల మన అప్రతిష్ఠ, వంశానికి దాపురించే కళంకం వాడవాడలా విస్తరిస్తుంది. మనతో మన వశంకూడా అంతరించిపోతుంది!"

"ఐతే ఇలాగే నికృష్టమైన జీవితం గడపమంటావ్?"

"కొద్దిరోజులు మాత్రం యిది తప్పని సరి. ఆ తరువాత మన అదృష్టం బాగుంటే అనుకూలమైన మార్గం దొరుకుతుంది. ఆనాడు మనం నిజరూపంతో కళంకరహితంగా లోకుల యెదుట పడతాం."

"కొన్ని వందలమంది యెదుట యథావిధిగా జరిగిన వివాహం రద్దుకావడం సమాజంలో సాధ్యపడుతుందా? మనం యీ జన్మలో మళ్ళీ అవివాహితులుగా చూడబడతామా? అదెన్నటికీ జరగదు!''

"కొన్నాళ్ళు ప్రయత్నించి చూద్దాం!"

"చాలా ఆశ్చర్యం కలిగిస్తున్నాయి నీ మాటలు ఎవరికీ యేమీ చెప్పక ఇలా గదిలో దుఃఖిస్తూ కూర్చోడం తప్పితే ఇంక ప్రయత్నమేముంటుంది?''

"ఉంది! అది ఎలాటి ప్రయత్నమో ఎంతవరకూ ఫలిస్తుందో ఇప్పుడు నేనేమీ చెప్పలేను. నువ్వుకూడా నీ తెలివినీ

ధైర్యాన్నీ కూడగట్టుకొని నాకు సహకరించాలి."

"హూ(!" అని దీర్ఘంగా నిట్టూర్చింది సత్యభామ.

అయోమయమైన, అంధకారబంధుర మైన అంతరిక్షంలో తేలుతూన్న వ్యక్తిలా నల్లగా నిగనిగలాడుతూన్న పందిరిమంచం స్తంభాన్ని పట్టుకొని వ్రేలాడుతూన్నట్టుగా నిలబడింది

ఆలోచనల బరువుతో మెల్లగా సోఫాలోంచి లేచాడు సత్యరాయణి. నెమ్మదిగా ఒక కిటికీవైపుకి నడిచాడు ఎర్రని రంగద్దాల కిటికీ తలుపులు తెరిచాడు. నక్షత్రాలు గ్రుచ్చుకొన్న నల్లని ఆకాశం వాని యెదుటబడింది. సహజమైన మలయమారుతం గదిలోకి దూసుకుకొని వచ్చింది. అంధకార జలధిలో మునిగివున్న పొగడచెట్టు నీటి యేనుగులా తలెత్తి కిటికీలోకి తొంగిచూసి వెనక్కి తప్పుకుంది.

## 2

సత్యవరప్రసాదరాయణిగారు "దివాణంతోట" జమీందారు. వారి తాతగారి కాలంలో ఆ గ్రామప్రాంతం ఒక పెద్ద మామిడితోట. సర్వసంపత్సమృద్ధిగల తాతగారు తమ తోటలో పెద్ద పెద్ద భవంతులు నిర్మించుకొన్నారు. చుట్టూ ఎత్తైన ప్రహరీలతో అనేకమంది దాసదాసీజనంతో ఆ తోట జమీందారుగారి దివాణమైంది. దాని చుట్టుప్రక్కల వారి సేవకాబృందం తమ నివాసాలు యేర్పరచుకొంటూరాగా ప్రసాదరాయణిగారి తండ్రి కాలంనాటికి 'దివాణంతోట' అనే గ్రామం యేర్పడింది ఏడెనిమిది దశలకాలం దివాణంతోట దివాణం అష్టైశ్వర్యాలూ కలిగి దానధర్మాలతో దైవ కార్యాలతో భోగవిలాసాలతో వాడ వాడలా కీర్తిప్రతిష్ఠలు గడించుకుంది.

'రాయణి' జమీందారులు, అభిమానధనులు. ఆత్మగౌరవం, వంశప్రతిష్ఠ, వారి దృష్టిలో అత్యంత ప్రధాన విషయాలు. వాటికోసం ధనాన్ని మంచినీళ్ళ ప్రాయంగా వెచ్చిస్తారు. తలతెగి క్రింద పడినా మానాభిమానాలు విడువరు. ఈ గుణాలన్నీ రాయణివంశంవారి నరనరాల జీర్ణించిపోయాయి.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చేసరికి సత్యవరప్రసాదరాయణిగారు ముప్పై సంవత్సరాల యువకుడు. తల్లీ తండ్రీ గతించిన కారణాన ఆయనే జమీందారీకి యజమాని. వారి భార్య మీనాక్షీదేవి సుందర సుకుమార మోహానాంగి. అప్పటికినాలుగేళ్ళ పిల్లవాడొకడు అల్లరిచిల్లరి చేష్టలతోను ముద్దుమాటలతోను వారింటికి నిండు తెచ్చేవాడు. రెండేళ్ళ వయస్సుగల ముద్దులపాప తల్లినీ తండ్రినీ మురిపించేది.

ఇదే సమయంలో 'దివాణంతోట జమీందారీ ప్రభుత్వపరమైపోయింది. రాయణి జమీందారుగారికి స్వంత ఆస్తులు



చాలా తక్కువగా ఉన్న కారణంచేత దివాణం ఆర్థికస్తోమత బాగా క్షీణించి పోయింది. కొద్దిగా ఉన్న స్వంతఆస్తుల్ని కూడా కొన్ని మాసాలలో అప్పులవాళ్ళు ఎత్తుకపోయారు. కేవలం దివాణం భవనాలూ చరాస్తులూ మాత్రమే ప్రసాద రాయణిగారికి మిగిలాయి. దివాణం వారిని ఆశ్రయించుకొన్న బంధువులూ స్నేహితులూ పరివారమూ సేవకులూ వారివారి బ్రతుకుతెరువులుచూచుకొంటూ తొలగిపోయారు. దివాణంలో నలుగురు నౌకర్లు అంతఃపురంలో యిద్దరు దాసీలు మినహా మరి యెవ్వరూలేరు.

శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి 'రాయణి' వంశంవారి ఇలవేల్పు. ప్రసాదరాయణిగారి తండ్రిగారు దివాణానికి దగ్గరలోనే స్వామివారి ఆలయ నిర్మాణం చేయించారు. స్వామివారి అర్చనకూ నిత్యధూపదీపనైవేద్యాలకూ అర్చకుని నియమించి స్వామివారికి తగినంత భూవసతి వారే కల్పించారు. స్వామివారి అర్చనలూ ఆరాధనలూ కళ్యాణ ఉత్సవాలూ అన్నీ దివాణం యజమానుల ఆధ్వర్యంలో జరుగుతూంటాయి

ఆ సంవత్సరం క్షీరాబ్ధి ద్వాదశినాడు

రాత్రి స్వామివారి దీపారాధనోత్సవం జరుగుతోంది. గ్రామంలోని పెద్దలూ పిన్నలూ చాలామంది దేవాలయందగ్గరకి చేరారు. ప్రసాదరాయణిగారు నాలుగేళ్ళ పిల్లవాణ్ణి వెంటబెట్టుకొని దేవాలయానికి వచ్చారు వారి వెనుక పాలకీలో మీనాక్షీ దేవి కుమార్తెను వెంటబెట్టుకొని వచ్చారు. గ్రామవాసులందరూ వారికి స్వాగత మిచ్చి వెలుపలి మండపంలోకి సర్దు కున్నారు. జమీందారుగారి కుటుంబం కోసం గర్భగుడి ఖాళీచేయబడింది.

ప్రసాదరాయణి దంపతులు పిల్లలతో సహా స్వామి యెదుట నిలచారు. ఘోషాలో ఉన్న మీనాక్షీదేవి స్వామి యెదుట పరదా తొలగించుకొని చేతులు జోడించి నమస్కరించింది. ఫలపుష్పా దులు స్వాములవారికి సమర్పించి నమ స్కరించారు. ప్రసాదాలు స్వీకరించారు. ఇంతలో అల్లంతదూరాన ద్వారందగ్గర నిలచివున్న దాసీ, "అమ్మా! అమ్మో! చీర...చీర అంటుకపోయింది" అని కేకలు పెడుతూవచ్చి మీనాక్షీదేవి చీరను ఆర్పడానికి ప్రయత్నించింది. ఉల్లి పొరలా మిలమిల్లాడే చీరచెంగుకి వెలుగు తూన్న ప్రమిదదీపం అంటుకొన్న మరు క్షణమే మంటపైకి వచ్చేసింది. ప్రసాద రాయణిగారూ పూజారీ కంగారుగా గోల చేస్తూ ఆమె చుట్టూ తిరుగసాగారు. పిల్ల లిద్దరూ "అమ్మా!అమ్మా"అంటూ గోలు గోలున యేడుస్తున్నారు

ఈ గందరగోళం, గోల, బైటవున్న జనం విన్నారు ప్రాణాలకి ముప్పుతెచ్చే ప్రమాదకరపరిస్థితి అంతస్తుల్నీ పరదా లనీ విస్మరింపజేసింది. వెలుపలి జనం లోపలికి వచ్చేశారు. కొన్ని క్షణాలలో గర్భగుడి జనంతో కిటకిటలాడింది. పొరలు పొరలుగా కట్టుకొన్న చీర మండు తూనే ఉంది దాసీకి భయమూ ఆందో ళనా యెక్కువై వెర్రిగా "అమ్మో!... తల్లో!" అంటూ కాలనిచోట చీరను నలుపుతోందేగాని మండే భాగాన్ని తాక డమేలేదు. దేవిని తాకడానికి నందే హిస్తూ అందరూ కేకలూ బొబ్బలూ పెడుతున్నారు. ఇంకా కొన్ని క్షణాలు అలాగే గడిస్తే సున్నితమైన చీరతో బాటు సుందరమూ సుకుమారమూ ఐన మీనాక్షీదేవి శరీరం కూడా కాలిపోయేదే!

ఇంతలో ఒక యువకుడూ ఒక వృద్ధుడూ దేవి దగ్గరకి దూసుకవచ్చారు. కాలుతూన్న చీర భాగాల్ని చేతులతో నలిపివేస్తూ చీరను చీరేస్తూ కొన్ని క్షణాల్లో మంటను పూర్తిగా ఆర్పివేశారు. పాపం, మంటల్ని ఆర్పి దేవిని కాపా డ్డమే వాళ్ళ పరమలక్ష్యం. కాని వాళ్ళు ఆ పనితోబాటు ఆవిడను వివస్త్రను చేసి వేశారు. వస్త్రాపహరణ సమయంలో ద్రౌపదివలె వుంది మీనాక్షీదేవిస్థితి. జమీందారుగారూ వారి కుటుంబమూ అంటే అగ్గగ్గలాడుతూ ఎంతో గౌరవాభి మానాలు ప్రదర్శించే జనం, నగ్నంగా

వున్న దేవిచుట్టూ నిర్విణ్ణులై నిశ్చేష్టులై నిలబడిపోయారు. ఇంతవరకూ రక రకాల హాహాకారాలతోను, ఆక్రందనల తోను బ్రద్దలైపోతుందా అన్నట్లున్న స్వామివారి గర్భాలయంలో ఒక్క సారిగా నిస్తబ్ధ నీరవవాతావరణం ఘనీభ వించింది.

మూలుగులాంటి నిట్టూర్పుతో దాసి తెలివి తెచ్చుకుంది అమ్మగారికి కట్టబెట్ట డానికి చీర కావాలి ఆమెకు. "చీర, చీర!" అంటూ గిరగిర తిరిగింది. తన చీరైనా విప్పి అమ్మగారికి చుట్టబెట్టాలనే ఆలోచన ఆమెకు కలగలేదో లేక అంతటి సాహసమే లేకపోయిందో, మరి!-ఆ గర్భగుడిలో క్రిక్కిరిసిపోయిన జనమంతా మగవాళ్ళే! ప్రమాదం కను గొనగానే వారంతా కంగారుగా లోపలికి దూసుకవచ్చారు. వెలుపల మండపంలో చాలామంది స్త్రీలు ఉన్నారు. కాని వారు వాళ్ళని తోసుకొని రాలేకపోయారు-దాసి తన చుట్టూ తాను తిరిగి మరొక్కసారి అమ్మగారి అవస్థ చూసింది. భరించలేక పోయింది. ఎదుట వేదికమీద సత్యవతీ దేవీ, శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారల నిలువెత్తు విగ్రహాలు ఆమెకు అభయహస్తాలు చాపినట్లనిపిం చింది చివాలున మూడు మెట్లెక్కి సత్య వతీ దేవికి అలంకరించినచీర వొలిచింది ఒక్క అంగలో క్రిందికి దూకింది. అమ్మగారికి ఆ చీరను చుట్టబెట్టేసింది.

రాయణి జమీందారుగారితో సహా అక్కడ గుమిగూడి కొయ్యబొమ్మల్లా నిలబడిన జనానికి అప్పటికి చైతన్యం కలిగింది. అతితొందరగా తోసుకొంటూ అందరూ బయటికి వెళ్ళిపోయారు వారి వెనుకనే రాయణిగారు చైతన్యరహితంగా నడిచారు మగపిల్లవాడు ఆయన చెయ్యి పట్టుకొని వెంటబడ్డాడు.

దాసి మీనాక్షీదేవిగారి పాపను చంక నెత్తుకుంది. అమ్మగారి చెయ్యిపట్టుకొని ప్రక్కద్వారంగుండా తీసుకొనివెళ్ళి పాలకీలో కూర్చొబెట్టింది.

ప్రసాదరాయణి నేరుగా దివాణంలోకి వెళ్ళారు. కచ్చేరీహాలు, అతిథి భవనం, ఆపై ఆవరణదాటి తమ భవనంలోని పడకగదిలో ప్రవేశించి తలుపు బిగించు కున్నారు పిల్లవాడు మాత్రం ఆయనతో ఉన్నాడు.

ఇంక దాసి మీనాక్షీదేవిని అర్ధచైతన్యా వస్థలో పాలకీలోనుండి దింపి అంతః పురంలోకి తీసుకొని వెళ్ళింది. నిద్ర పోతూన్న పాపని తూగుటుయ్యాలలో పరుండబెట్టింది అంతఃపురంలోవున్న రెండవదాసి అమ్మగారి అవస్థచూసి 'ఏమి టని, సంజ్ఞతో మొదటి దాసిని ప్రశ్నిం చింది. ఆమె సంజ్ఞద్వారానే మాట్లాడ వద్దని నోరు నొక్కింది. ఇద్దరూ కలిసి అమ్మగారిని స్నానాల గదికి తీసుకవెళ్ళి పసుపునలుగుబెట్టి నీళ్ళు పోశారు. చలువ చీర కట్టి చక్కగా కేశపాశాన్ని చుట్టి అలంకరించారు.

దేవాలయంలో జరిగిన దుస్సంఘట నకు మీనాక్షీదేవి అవమానంతోను శోకం తోను కృంగిపోయింది. ఆవిడ కన్నుల నుండి కన్నీరు సంతతధారగా యిప్పటి వరకూ కారుతూనేవుంది కాని ఏమని దుఃఖించగలదు? ఎవరేమి చేశారని? అక్కడున్న వారంతా తమకుటుంబాన్ని ఎంతో గౌరవంతోను అభిమానంతోను చూస్తూన్నవారే. జరిగినది దుస్సంఘటన! అది తన మానాన్నీ ఆత్మగౌరవాన్నీ నాశనంచేసింది! ఆవిడ మెదడు శోకంతో స్తంభించుకొనిపోయింది. అవమాన భారంతో శిరస్సు మొద్దుబారిపోయి కొన్ని ఘడియల బరువెక్కిపోయింది. తన శరీరాన్ని మాత్రం దాసీకి వప్ప గించి ఆవిడ అర్ధచైతన్యావస్థలో ఉండి పోయింది

దాసీలు దేవిని పాన్పుమీద పరుండ బెట్టి పంకావేశారు. అప్పటికి మీనాక్షీదేవి నోరు మెదిపింది. "అయ్యగారు? బాబు?" అని ప్రశ్నించింది దాసీని

"పడకగదిలో ఉన్నారమ్మా యిద్దరూ. తలుపులు మూసుకున్నారు," అని చెప్పింది దాసి.

దీర్ఘంగా నిట్టూర్చి కళ్లుమూసుకుంది దేవి.

ప్రసాదరాయణిగారి అవస్థ వర్ణనా తీతం "రాయణి జమీందార్ల వంశంలోని యువతి, తన భార్య, అంతఃపురవాసిని, ఘోషా స్త్రీ, అంతమంది జనసమూహంలో దిగంబరి అయింది! నీచాతినీచ మైన బజారు వ్యభిచారిణికూడా అలా నగ్నంగా నిలబడదే! ఇంతకు మించిన ఘోరావమానం లోకంలో ఇంకేముం టుంది? తరతరాలుగా పెంపొందించు కొంటూ వచ్చిన వంశగౌరవం, కీర్తి ప్రతిష్ఠలు ఈ ఒక్క సంఘటనతో నశించిపోయాయి! తెల్లవారితే రాయణి జమీందారుల అంతఃపురగాథ వాడ వాడలా వ్యాపించిపోతుంది! తెల్లవారితే తను ఎవరి ముఖం చూడగలడు? ఎవరికి తన ముఖం చూపగలడు? ఇంక యీ జీవితం వ్యర్థం! తానేకాదు, తన వంశ లోని ఏ ఒక్క ప్రాణి జీవించి ఉన్నా వానిని వేలెత్తి చూపుతుంది లోకం! ఇంక తన వంశం నశించవలసిందే! భార్యనీ పిల్లల్నీ చంపి తాను చావవలసిందే! అంతే ...మరి మార్గంలేదు!—" అనుకున్న ప్రసాదరాయణిగారు చర్రున మేజా సొరుగులాగాడు రివాల్వరు తీశాడు గుళ్లు యెక్కించాడు. మంచంమీద నిద్రపో తూన్న బాబుకి గురిపెట్టాడు. వెంటనే విచక్షణ చలించి చెయ్యి పట్టుకొని ఆపి నట్లయింది— "బాబుని కాలిస్తే...ఈ ధ్వనికి అందరూ లేస్తారు! అల్లరై పోతుంది! ఇంక దేవినీ పాపనీ కాల్చడం సాధ్యపడదు!" అనుకున్నాడు. "అంద రినీ ఒకేచోటికిచేర్చి ఒకే క్షణంలో పని పూర్తిచేసుకోవాలి!" అని ఆయనకి తోచింది నిద్రపోతూన్న బాబుని చివా



లున లేవదీసి భుజానవేసుకొన బోయాడు. కెవ్వున కేకవేసి బాబు నిద్రలేచాడు. "బాబూజీ, బాబూజీ!" అని యేడుస్తూ రాయణి మెడకు చేతులు చుట్టి కావలించుకున్నాడు.

రివాల్వరు మంచంమీద పడేసి "ఏం బాబూ? ఏం? భయమేసిందా? కల వచ్చిందా?...భయంలేదు. నిద్రపో!" అంటూ బాబుని భుజంమీదనే ఉంచుకొని జోకొడుతూ పచారు చేయసాగాడు రాయణిగారు.

"బాబుని జోకొడుతూన్న ఈచేతితో బాబుని కాల్చిచంపాలా? పాపనీ దేవినీ హతమార్చాలా? నేను ఆత్మహత్య చేసుకోవాలా?...ఛా, అసాధ్యం! నావల్లకాదు! ...ఐతే, ఈ అవమానం భరిచంచడమెలాగ?...రాత్రి గడిచిపోతోంది! తెల్లవారుతుంది!" – అనుకోగానే ఆయన గుండె ఝల్లుమంది.

మళ్ళీ నిద్రపోయిన బాబుని మంచం మీద పరుండబెట్టి ఇనప్పెట్టె తెరచాడు. అందున్న నోట్లకట్టలు, బంగారు వస్తువులు కొన్నితీసి లెదర్ సూట్ కేసులో పెట్టుకున్నాడు. బీరువా తెరచి బాబువీ తనవీ బట్టలు తీసుకొని పెట్టెలోకూరి తాళం వేశాడు. మెల్లగా బాబుని యెత్తుకొని భుజంమీద పడుకోబెట్టుకున్నాడు. రెండవ చేతితో పెట్టెపట్టుకున్నాడు. గోడ గడియారం ఒంటిగంట కొట్టింది. దివాణం వెనుక భాగానికి, అంతఃపురం ప్రక్కనుండి నడచి, పశువులశాలలు దాటి మామిడితోటను గడచి కాలవ

గట్టున యెవరి కంటనూపడకుండా నడచి పోయాడు. అలా రెండు గంటలసేపు నాలుగుమైళ్ళు నడచి రైలుస్టేషను చేరాడు. ఒక అరగంటలో ఏదో రైలు ప్లాట్‌ఫారమ్‌మీదికి వచ్చింది. నాలుగేళ్ళ పిల్లవానితోసహా ప్రసాదరాయణిగారు రైలు యెక్కాడు ఒక వారంరోజుల పాటు రైళ్ళలో ప్రయాణంచేసి చేసి చివరికి బొంబాయి చేరాడు.

రాయణిగారు పిల్లవానితో హోట లులో చాలాకాలం ఉండడం యిష్టంలేక అద్దెయింటికోసం అన్వేషించాడు. ఆ సమయంలో రాయణిగారికి ఒక విశిష్ట వ్యక్తితో పరిచయమైంది. ఆయన పేరు రఘుపతిరాయలు. తెలుగువాడు. గొప్ప కమీషన్ వ్యాపారి. విదేశీ కంపెనీలకి స్వదేశీ కంపెనీలకి మధ్య ఉండి సరకుల క్రయవిక్రయాలు చేస్తూ ంటా డు. మధ్యగా మిగిలే లాభాలు జేబులో వేసు కుంటాడు ఈ వ్యాపారంలో మంచి తెలివీ చాకచక్యమూ సమయస్ఫూర్తి ఉన్నవాడు రఘుపతిరాయలు, అందు చేతనే బొంబాయికి చేరిన పదిహేను సంవత్సరాలలో కొన్ని లక్షలు గడించ గలిగాడు. భార్యతోను నాలుగేళ్ళ వయస్సుగల కుమారునితోను ఆయన విశాలమైన స్వంత బంగళాలో ఉంటు న్నాడు. మొదటి పరిచయంలోనే ప్రసాద రాయణిగారి వ్యక్తిత్వం రఘుపతిరాయ లును ఆకర్షించింది. సాటి తెలుగువాడు, ఉన్నత వంశానికి చెందినవాడని గ్రహించి తన బంగళాలోని ఒక ప్రక్కభాగంలో ప్రసాదరాయణిగారికి నివాసమిచ్చాడు రఘుపతిరాయలు.

తన గతి యింక అధోగతే, అనే నిర్ణ యానికి వచ్చివేశాడుకాని పిల్లవాని భవి ష్యత్తు ఎలాగా అని చింతిస్తూన్న ప్రసాద రాయణిగారికి రఘుపతిరాయలు పంచను చేరడంతో కొంత సంతృప్తి కలిగింది. కొద్ది కాలంలోనే ప్రసాదరాయణిగారి నాలుగేళ్ళ పిల్లవాడు సత్యరాయణి, రాయలుగారి కుటుంబంలో ఒకడుగా కలిసిపోయాడు. రాయలుగారి కొడుకు, క్రిష్ణచంద్రరాయలు వానికిసమవయస్కు డైనందున ఆ యిద్దరూ అన్నదమ్ముల్లా ఆహారవిహారాలలో ఆటపాటలలో ఒక టిగా కలిసి ఆత్మీయులైపోయారు. రాయలు దంపతులిద్దరూ పిల్లల నిద్దర్నీ సమానమైన అనురాగంతో ఆదరిస్తు న్నారు.

"ఈ తండ్రీ కొడుకులిద్దరూ ఎక్కడి నుండి వచ్చారు? ఎందుకిలా వచ్చి ఉంటు న్నారు?" అనే ప్రశ్నలు రాయలు దంప తుల్లో బయలుదేరి రెండు మూడుసార్లు అడిగారు. కాని ప్రసాదరాయణిగారు ఆ వివరాలు ప్రస్తుతం అడుగవద్దనీ సమ యం వచ్చినప్పుడు తానే చెప్తాననీ దాట బెట్టేవాడు. ఏదో చెప్పరాని దుస్థితిలో వున్న కులీన వంశీకుడని మాత్రం వారు

ప్రసాదరాయణిగారి వ్యక్తిత్వాన్ని, నడ వడిని చూసి గ్రహించారు.

ఒక సంవత్సరం గడిచేటప్పటికి ప్రసాదరాయణిగారి మానసికమైన వ్యథ వ్యాధిగా పరిణమించి మంచం పట్టిం చింది. తాను బ్రతుకుతాననే ఆశ ఆయన కింక క్షీణించిపోయింది. బ్రతకాలనే కోరిక అంతకు ముందేలేదు. అటువంటి స్థితిలో ఒకనాడు రాయలు దంపతుల సమక్షంలో సత్యరాయణిని దగ్గరకు పిలిచాడు. తన మెడలోని బంగారు పత కాన్ని తీసి వాని మెడలో వేశాడు "బాబూ, ఈ పతకం మన వంశానికి చిహ్నం. దీనిలో మన ఇలవేల్పు, శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి బీజాక్షరాలతో రక్షరేకు ఉంది. మన వంశంలో పుట్టిపెరిగిన వారందరికీ ఇటువంటి పతకం ధరించడం ఆచారం. దీన్ని భద్రంగా చూచుకో నాయనా!" అని వానికి అర్థమయ్యేలా జాగ్రత్తగా చెప్పాడు. రాయలు దంపతులకి పిల్ల వానిని ఒప్పగిస్తూ ఏభై వేల రూపాయలు నిలువయున్న తన బ్యాంక్ ఎకౌంటు తాలూకు పాస్‌బుక్‌ను ఆ సొమ్మును తీసుకునే అధికారపత్రాన్ని వారి చేతుల్లో పెట్టాడు-"నేను ఆంధ్రప్రాంతం తూర్పు గోదావరి జిల్లాలోని దివాణంతోట జమీం దారును. ఆర్థికంగాను మానసికంగాను గట్టి దెబ్బలుతిని, యింక స్వస్థానంలో నిలువలేక యిక్కడికి చేరాను. అక్కడ నా భార్యా, కూతురూ ఉన్నారు బాబుని వాళ్ళదగ్గరకి చేర్చండి. వాళ్లూ నాలాగే శిథిలమైపోయి కనుపించకపోతే, బాబు మీ కుమారుడే నాకింక యీ లోకంతో సంబంధం తీరిపోయింది నేను కోరేది శాశ్వత శాంతి. అది కొలంది కాలంలోనే ప్రాప్తించనుంది," అని వారితో చెప్పి ప్రసాదరాయణిగారు ఒక వారంరోజుల్లో పరమపదించారు.

తరువాత రఘుపతిరాయలుగారు సత్యరాయణిని వెంటబెట్టుకొని దివాణం తోట వెళ్ళారు. కాని రాయణిగారి భార్యా కుమార్తెల జాడ తెలియలేదు. ఇంక చేసేదిలేక రాయలుగారు సత్యరాయణితో తిరిగి బొంబాయి వచ్చివేశారు. బాబు, సత్యరాయణి పూర్తిగా రాయలుగారి కుటుంబానికి చెందిపోయాడు.


మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన పదేళ్ళకి దేశీయపరిశ్రమలకి విశేషంగా ప్రోత్సాహం లభించింది. క్రమేణా విదేశీ సరకుల దిగుమతులు తగ్గిపోయాయి. ఇంకా సాగుతూన్న కొన్ని రకాల సర కులమీద పన్నులు అధికమైపోయాయి. ఈ పరివర్తనతో రఘుపతిరాయలుగారి విదేశీయ వ్యాపారం క్రమక్రమంగా సన్నగిలిపోయింది. ఇంక దేశంలోని పారిశ్రామికులకి వ్యాపారులకి మధ్య కమీషన్ వ్యాపారం సాగించడం రాయలుగారికి హీనంగా కనుపించింది. దీనివల్ల విశేషలాభం కూడా లేదని

ఆయనకితోచింది. వెంటనే ఆయనఅన్ని వ్యాపారాలూ విరమించాడు. ఏ వ్యాపారమూ, వ్యాపకమూ లేకుండా బొంబాయిలో కూర్చోడం ఆయనకి అనవసరమనిపించింది. ఇప్పటికి సంపాదించిన లక్షలతో తన జన్మస్థానం చేరుకొని స్వగ్రామంలోని స్వగృహంలో ఉండి స్వంత భూములనూ తోటలనూ సేద్యం చేయించుకొంటూ ప్రశాంతంగా జీవితం గడపాలనే నిశ్చయానికి వచ్చాడు రాయలుగారు

1958 సంవత్సరంలో రఘుపతి రాయలుగారు ఇరవైయైదు సంవత్సరాల తన బొంబాయి జీవితానికి స్వస్తిచెప్పి ఆంధ్రలో సాకేతపురానికి సమీపంలో వున్న 'రాయల మాన్యం' అనే స్వగ్రామం చేరుకున్నాడు. అప్పటికి పదిహేను సంవత్సరాల వయస్సుదాటిన క్రిష్ణ చంద్రరాయలిని, సత్యరాయణిని సాకేత పురం కాలేజీలో చేర్చాడు

మూడేళ్ళు కాలేజీ చదువు పూర్తిచేసి రాయలు, రాయణి ఫైనలియర్ బి ఎ.లో అడుగుపెట్టారు. ఆ సమయంలో హరికో చక్కని చుక్కతో వారి కాలేజీలో చదివే కన్యారత్నంతో పరిచయం కలిగింది. ఆ అమ్మాయివూరు, రాయలు మాన్యానికి సాకేతపురానికి మధ్య రోడ్డున చేరివున్న నందనవనం. ప్రతి దినమూ రాయలూ రాయణీ స్వంత కారులో 'రాయలు మాన్యం' నుండి సాకేతపురం కాలెజీకి వెళ్ళేటప్పుడూ యింటికి తిరిగివచ్చే సమయంలోను ఆ అమ్మాయి వాళ్ళకి జట్కాబండిలో కనువించేది. ప్రతిరోజూ మార్గంలోను కాలేజి ఆవరణలోను వాళ్లచూపులు కలిసేవి. ఆ అందాలభామ సౌందర్యం వారి మెదళ్ళలో అనేకప్రశ్నలు దయింపజేసింది. ఆలాగే ఆమెకూడా 'యీ సుందరరూపు లెవరా' అని తన మనసులో గాలించింది. ఇలా వారు ముగ్గురూ చూపులదారాలకి ప్రశ్నల గాలిపటాలుకట్టి కొన్నాళ్ళపాటు ఎగరవేసుకున్నారు

ఒకనాడు కాలేజీ విడిచిపెట్టిన సమయానికి ఆ అమ్మాయికి బండిరాలేదు. మన యువకవిద్యార్థు లిద్దరూ సభ్యతతో ఆప్యాయంగా ఆమెను తమ కారులోకి ఆహ్వానించారు. అనభ్యత కెంత మాత్రం తావివ్వకుండా వినయపూర్వకంగా వాళ్ళ ఆహ్వానాన్ని నిరాకరించింది ఆ అమ్మాయి. ఆతరువాత రెండు మూడు సార్లు ఆమెకు సమయానికి బండి రాని పరిస్థితి యేర్పడ్డం, ఈ అపూర్వ సహోదరులు ఆమెను తమ కారులోకి ఆహ్వానించడం ఆమె మామూలు ధోరణిలో నిరాకరించడం జరిగింది. కాని ఒకనాడు యింటికి తిరిగి వెళ్లేసమయంలో పట్నం పొలిమేరలో మన విద్యార్థుల కారు పేచీపెట్టింది. డ్రైవరుతో సహా వారిద్దరూ దాన్ని బ్రతిమాలగా అది పెంకితనంచేసి వేలు




లాంటి కీలునువిరగగొట్టుకుంది ఆ సమయంలో అందాలభామ అశ్వాశకటం టకటకా వచ్చి సందేహంతో కారును చూస్తూ చూస్తూ ఆగింది.

"మా బండి యెక్కండి. డ్రైవరు కారు బాగుచేసుకొని వస్తాడు" అని మందస్మిత వదనంతో మధురంగా సత్యేతను కౌగలించుకొంటూ వాళ్ళని పిలిచింది అందాలభామ.

మొదట కొంచెం తచ్చాడి పిమ్మట విద్యార్థులిద్దరూ డ్రైవరుతో చెప్పి ఆమెనంటిపెట్టుకున్న సత్యేత కివతలబండిలో కూర్చున్నారు రాయలు ఖిడియంతో ఆమెకేసి చూడలేకపోతున్నాడు కాని రాయణి తన అందంలోని కళలు ఆమెలోకూడా మెరుస్తూండడంతో తమ యిద్దరి మధ్యా బాంధవ్యం ఉందనుకున్నాడు ఆమెను పలుకరించకపోతే తమ యిద్దరికి మధ్యనున్న సత్యేత కోపగించి బండిదిగి పోతుందనుకున్నాడు. చిన్న చిన్న ప్రశ్నలు ఆచి ఆచి వేస్తూ ఆమెను గురించి తెలుసుకొంటున్నాడు.

బండిలోంచి దిగుతున్నాడా అన్నట్టుగా బండివెనుక వెనక్కి తిరిగి కూర్చున్న చంద్రరాయలు చెవులు రిక్కించి రాయణివేసే ప్రశ్నలూ వాటికి ఆమె పలికే సమాధానాలూ వింటున్నాడు—"ఈమె నివాసం నందనవనం. తెలిసిన విషయమే బి ఎ ఫస్టియర్. ఇదీ మాకు తెలుసు. పేరు సత్యభామ; భలే, వయ్యారి, వగలాడి మగువ; ఈమె మేనమామగారింట్లో ఉంటోందా? ఆయన రిటైర్డ్ సూపర్నెంట్ ఆఫ్ పోలీసా? బాగుంది. ఈమెకు తల్లి ఉంది. పాపం,

తండ్రి యెక్కడో పరదేశంలో ఉన్నట్ట ఐతే మరి, ఈ అమ్మాయి స్వంత ఊరో? మా రాయణి అడిగితేగా యీమె చెప్ప డానికి; అంత దూరం అడగడం యిప్పుడు అప్రస్తుతమేమో! అంచేతనే మావాడు అడగలేదు!"—అని ఆమెకు సంబంధించిన వివరాలను తన వ్యాఖ్యా నాలకి పెనవేస్తూ తన మెదడుకి కట్టు కొంటున్నాడు రాయలు.

బండి నందనవనం చేరింది. సత్య భామ సత్యతతో సహా బండిదిగి సెలవు తీసుకుంది.

ఆనాటినుండీ వాళ్ళు పనిపెట్టుకొని పలకరించుకోడం, కాలేజీవిశేషాలు చెప్పు కోడం సాగించారు. రాయలు కూడా కూడా ఉంటూనే దూరం కాసాగాడు. వానిని ఆకర్షణ ఒక అడుగు ముందుకి తోస్తోంది; వెంటనే బిడియం బిగబట్టి నాలుగడుగులు వెనక్కి లాగుతోంది. రోజులు గడుస్తూన్నకొలదీ సత్యరాయణి సత్యభామల స్నేహం పురి యెక్కి యెక్కి మాసాలు గడిచేసరికి పెనవేసు కొనిపోయి ఇంక వేరుచెయ్యటానికి వీలు లేని విధంగా తయారైంది. ఇది కని పెట్టిన రాయలు తన బరువూ బాధ్యతా తొలగినట్టు భావించి నిట్టూర్చాడు. ఇంత కాలం రాయణిలా తను కూడా సత్య భామతో మాట్లాడాలని ఆమెను ఆక ర్షించుకోవాలని లోలోపల సతమతమౌతు న్నాడే కాని ఒక్కనాడూ ఆమెతో సరదాగా మాట్లాడ సాహసించలేక పోయాడు ఎప్పుడైనా భామ తనంత తాను పలకరిస్తే తల ఊపడంద్వారాను పెదిమలు మెదపడం ద్వారాను చూసీ చూడనట్టూ మాట్లాడీ మాట్లాడనట్టూ కాలక్షేపంచేస్తూ వచ్చాడు.

సత్యరాయణి,సత్యభామల విహారాలు, వినోదాలు, విలాసాలు, విద్యావ్యాసం గాలు మొదలైనవాటిలో దగ్గరకిచేరి చెట్టాపట్టాలుపట్టి అట్టట్టే హత్తుకపోయి వాళ్ళ ప్రతి పనినీ 'భామారాయణం' అనవలసివచ్చేసరికి, ఆ మధ్య తానుండ డంరాయణికి అపచారంచేసినట్లౌతుందనే వివేకం కలిగి తన ప్రయత్నం విర మించి తనవాని కృషికి చేయూత నివ్వ డం మొదలుపెట్టాడు రాయలు.

భామా రాయణుల స్నేహం ఊసర వెల్లిలా రంగు ఫిరాయించి ప్రేమగా మారింది. ఆ ప్రేమ పరాకాష్ఠకిచేరి పెళ్ళి కోసం తహతహలాడింది. అంతట రాయలు రంగంలో కురికి సంధాన కర్తగా వ్యవహరించాడు. ఇటు తన తండ్రితో సత్యభామ గుణగణాలనూ అందచందాలనూ అద్భుతంగా వర్ణించి చెప్పి మన రాయణికామె తగినపిల్ల అనీ వాళ్ళిద్దరికి పెళ్ళిచేస్తే మూడు పువ్వులూ ఆరుకాయలూగా వర్థిల్లుతారనే ధోరణిలో అతి జాగ్రత్తగా బోధించాడు. సత్య భామ మామను తరచూ కలసికొంటూ ఆయన యెడల అత్యంత వినయవిధేయ



తలు ప్రదర్శిస్తూ తాను బి.ఎ. పాసయాక పోలీసుశాఖలోనే ఉద్యోగం చేస్తానని ఆయన్నీ ఆయన పనిచేసిన పోలీసు శాఖనీ ప్రశంసిస్తూ ఆ మాటల మధ్యలో రాయణి ప్రతిభా విశేషాలను అద్భుతంగా అభివర్ణించేవాడు రాయలు రాయణి లాంటి యువకుడు లక్షమందిలో ఒక్కడుకూడా లభించడన్నాడు వాని లోని ప్రతిభ సత్యభామకి ఒక విశేష ఆకర్షణ అనీ భామలోని గుణగణాలనూ ఆమె రూపురేఖావిలాసాలనూ రాయలు ఆరాధిస్తాడనీ సందర్భానుసారంగా వెల్లడించాడు. రాయలు చేసిన కృషి ఫలించి పెద్దలద్వారా రాయణి సత్యభామల వివాహం నిశ్చయమైంది. వైభవంగా పెళ్ళి జరిగిపోయిందికూడా.

రిటైర్డ్ సూపరెన్టెంటుగారిని బాగా ఆకర్షించి లోబరచుకున్నాను అని అనుకున్న రాయలు నిజానికి తానే ఆయన బుట్టలో పడ్డాడు ఆయన రాయలుని తన అల్లుడుగా చేసుకోవాలనే ప్రయత్నాన్ని రాయణి సత్యభామల వివాహ విషయంతో రంగరించాడు. 'నువ్వు ఒకందుకు పోస్తున్నావు, నేనొకందుకు త్రాగుతున్నాను,' అన్నట్టుగా రాయలు ఒకందుకు సూపరెన్టెంటుగారిని ఆకర్షించి

ప్రశంసించి ఆయన అభిమానం సంపాదించడానికి ప్రయత్నిస్తే సూపర్నెంటు గారు మరొకందుకు రాయలును చేరదీసి తన మంచితనాన్ని గొప్పతనాన్ని ప్రదర్శించి వాసని తన అల్లుణ్ణి చేసుకోడానికి ప్రయత్నించారు భామా రాయణుల వివాహమయాక సూపర్నెంటు గారు తన మనసులోని మాటను రాయలుకి వెల్లడించారు.

ఆ మాట వినగానే అకారణంగా చెంపదెబ్బతిన్నవానిలా తెల్లమొహం వేశాడు రాయలు "నాకు కొంచెం అవకాశం యివ్వండి మా వాళ్ళతో సంప్రదించి తరువాత మనవిచేస్తాను" అని సూపర్నెంటుగారికి విన్నవించుకొని ఆయన యెదుటినుండి పారిపోయాడు.

"బాబోయ్, కమలాక్షినే? నేనే! పెళ్ళి చేసుకోడమే! సూపర్నెంటుగారు మంచి యెత్తువేశాడే! ఎలాగైనా పోలీసు సూపర్నెంటు కదూ? దేవాంతకుడు! పిల్లని చూడకుండా ఈయన హోదానీ వ్యక్తిత్వాన్నీ చూస్తే ఈయన కూతుర్ని పెళ్ళాడ్డానికి చాలామంది యిష్టపడొచ్చు కాని ఈ నల్లపిల్లిని చూశాక ఎవ్వడూ ఈమెను చేసుకోడానికి యిష్టపడడు స్కూలుఫైనలు క్లాసు చదువుతూంటే మాత్రం తెలివితేటలుంటేమాత్రం ఆ ఆకారం ఎవడు సహించగలడు? నా కొద్దు భగవంతుడా! నేను భరించలేను ఇలాంటి నల్ల శిలాసుందరిని! ... ఐతే ఎలా తప్పించుకోవాలి? సూపర్నెంటు గారికి ఏమని చెప్పాలి!...అమ్మతోనూ నాన్నగారితోనూ చెప్తే? మా అమ్మా నాన్నా యిష్టపడ్డంలేదంటే? ... వాళ్ళతోనే పెద్దాడు, ఈయన పెళ్ళిబేరం!... బి ఎ. చదివేవాణ్ణి, లక్షాధికారి కొడుకుని అంత తేలిగ్గా వదిలేసాడా?... వాళ్ళు మొహమాటానికి కాదనలేక అంతా అబ్బాయి యిష్టమంటే? అప్పుడు నా అవస్థ ఏంకాను?...రాయణి మా మేనత్త కొడుకని చెప్పి మావాళ్ళచేత అలాగే చెప్పించి ఆ పెళ్ళయేర్పాటంతా చేయించాను. సత్యరాయణి పేరు సత్యరాయలుగా మార్చి, ఇతను రాయలుగారి పెద్ద కొడుకు, నాకు స్వయానా అన్న అని చెప్పకుంటే నాకీనాడు యీ ముప్పు రాకపోను! ... జరిగినదేదో జరిగి పోయింది...ఈ విషయంలో తొందర పడి నేనేమీ చెయ్యకూడదు! ముందు రాయణితో యీ సంగతి చెప్పాలి ఇద్దరం కలిసి ఈ అపాయానికి ఉపాయం ఆలోచించాలి!" అనుకున్న రాయయి ఆ సాయంకాలం ఊరివెలుపల తోటల్లోకి షికారుకి వెళ్ళినప్పుడు రాయణితో తన విషమ సమస్యను వివరించాడు.

## 3

భామారాయణుల వివాహమై పది రోజులయింది. తమ బంధ విముక్తికి ఏదో మార్గ మాలోచిస్తానని భామతో అన్నాడేగాని రాయణి కింతవరకూ ఏమీ

తోచలేదు. ఆ విషయాన్ని గురించి ఆలోచిస్తూంటే అతనికి అంతా అంధకారం, అయోమయమే తప్ప వెలుగుబాట గోచరించటంలేదు— "కొన్ని వందలమంది బంధువులు, స్నేహితులు, పరిచయస్థుల సమక్షాన యేర్పడిన వివాహబంధం విడిపోవడమెలాగ? విడాకు లిచ్చుకుందామా అంటే వీధిని పడాలి! అది తమ యిద్దరి జీవితాలను నాశనంచేస్తుంది! ఏం చెయ్యాలి? ఏది మార్గం?" — అనే యోచనలతో వాని తల దిమ్మెక్కిపోతోంది నావలో పడిన చేపలా వుంది వాని పరిస్థితి.

కలవారి కుటుంబంగనుక వివాహమై పదిరోజులైనా ఇంకా విందులూ వినోదాలతో యిల్లు కలకల్లాడుతూనే వుంది. రాత్రి మేడమీది ఏకాంత మందిరంలోకి భామా రాయణులు ప్రవేశించడం తప్పడంలేదు గదిలో ప్రవేశించగానే దీనంగా ప్రశ్నార్థకంగా రాయణివైపు చూస్తుంది సత్యభామ. 'ఇంకా యేమీలేదు' అన్నట్టుగా చిన్నగా నిట్టూర్చి తలవాల్చుకుంటాడు రాయణి. రేడియో సన్నగా వాగుతూంటుంది. ఫాన్ తిరుగుతూంటుంది. చిన్న మెర్క్యూరీ బల్బు వెలుగుతూంటుంది. ఒకరికొకరు సంబంధం లేకుండా కొంతసేపు మేడ గదిలోను వరండాలోను పచార్లుచేస్తారు. తిరిగి ఆమె ఒకవైపు సోఫాలోను అతను వేరొకవైపు సోఫాలోను కూలబడతారు అలాగే నిద్రపోయి తెల్లవారుస్తారు. పట్టుపరుపుల పూలపాన్పు వీళ్ల వ్యవహారం అర్థంగాక తెల్లబోయి చూస్తూంటుంది

ఇంక పగటివేళ సాధ్యమైనంత వరకూ ఏదో సాకుచెప్పి సన్నిహితుల్నందరినీ తప్పించుకొంటాడు రాయణి. తిన్నగా ఊరి వెలుపలనున్న తోటల్లోకి పోయి ఏకాంతంగా కూర్చుంటాడు. రాయలు వానిని వెతుక్కొంటూ వచ్చి తోటల్లో కలుసుకుంటున్నాడు. ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండవలసిన రోజుల్లో రాయణి ఇలా దిగులుగా అందరికీ దూరంగా ఉండడానికి కారణం తెలుసుకుందామని రాయలు తన యావచ్ఛక్తినీ వినియోగించాడు. కాని రాయణి నోరువిప్పి మాట్లాడడు మాట్లాడనే మాట్లాడితే "ఇప్పుడు నన్నేమీ వేధించకు. కొద్దిరోజుల్లో నీకే తెలుస్తుంది" అని మాత్రం అంటాడు.

చివరికి విసుగెత్తి "నూతన దంపతుల్లో ప్రణయ కలహంలాంటిది బయలుదేరి ఉంటుంది. ఎన్నాళ్లుంటుందిలే! వాళ్ళంతట వాళ్లే రాజీపడతారు" అని ఊహించుకొని సంతృప్తి చెందాడు రాయలు.

ఇలా పదిరోజులు గడిచాక, సాయంకాలంవేళ తోటలో రాయలు రాయణితో తన వివాహవిషయం మొరపెట్టుకున్నాడు.

మొదట పరధ్యానంగా వాని మాటలు విన్న రాయణి "చాలా బాగుంది, చేసుకో! మీ అమ్మతోను, నాన్నగారితోను నేను చెప్తాలే!" అన్నాడు.

ఈ సలహా వినగానే రాయలుమనసు చివుక్కుమంది. "ఔనులే, నీ అందాల భామ సౌందర్యం అధికంగా శోభించా లంటే యీ దీపంసెమ్మా, కమలాక్షి, భామ ప్రక్కనుండవలసిందే ! నువ్వు యింత స్వార్థపరుడి వనుకోలేదురా ! చిన్నప్పటినుండీ ఒక కంచంలో తిని ఒక మంచంమీద పరుండి అభేదంగా ఆత్మీయులమై, రామలక్ష్మణుల్లా ఉన్నా మనుకున్నాను. చాలా పొరబడ్డానన్న మాట!" అన్నాడు.

ఈమాటలునిప్పురవ్వల్లా చురుక్కున తగిలి రాయణి పూర్తిగా చైతన్యంలోకి వచ్చాడు.

"ఆ, ఏమన్నావురా ? ఏదో నా దురవస్థకి దురపిల్లుతూ పరధ్యానంగా ఉన్నాను. నీమాటలు పూర్తిగా వినలేదు. నీ అభిప్రాయం అర్థంచేసుకొనక ఏదో అన్నాను గానీ నిన్ను మించిన ఆత్మీ యుడు ఇంకెవడున్నాడురా నా కీలోకంలో. నీకు నచ్చని పిల్లని పెళ్ళి చేసుకోమంటానా ? ఆ కమలాక్షిని పెళ్లాడవలసిన ఒత్తిడి కలిగినట్లయితే స్పష్టంగా చెప్పు! నేనే ఆమెను వివాహం చేసుకొని నీ ముప్పును తప్పిస్తాను !" అన్నాడు ఆవేశంగా.

"ఒరేయ్ రాయణీ ! నీకు నిజంగా మతిపోయిందేమిట్రా బాబూ! కమలాక్షిని నువ్వు పెళ్లాడ్డమేమిటి? భామనేంజేస్తావ్? నేనూహించింది నిజమే ! మీ యిద్దరికీ యేదో గట్టి కలహమే వచ్చింది!"

"లేదు, కలహమూలేదు. నాకు మతి పోనూలేదు. ఇదంతా మా దురదృష్టం!" అన్నాడు రాయణి గంభీరంగా నిట్టూరుస్తూ.

"మరైతే ఏంజరిగింది ? స్పష్టంగా చెప్పురా నాయనా లోలోపల కుళ్లిపోక!"


"ఔను, చెప్తాను! నీతోనూ చెప్పక ఎన్నాళ్లని ఇలా కృంగి కృశించిపోతాం! రాయలూ, నువ్వు మళ్లీతప్పుగా భావించ నంటే ఒక్కసంగతి అడుగుతాను, దాపరికం లేకుండా చెప్తావా?"

"నీ దగ్గర నాకు దాపరికం, రహస్యం ఉన్నట్టు నువ్వు ఎప్పుడైనా కనిపెట్టావా ? అసలుసంగతి త్వరగా చెప్పరా!"

"చెప్తా తొందరపడకు. నిదానంగా నీ అంతరాత్మకి నువ్వు సమాధానమిచ్చి నట్టుగా నాకు జవాబు చెప్పు ! భామ అన్నివిధాలా నీకు నచ్చిందా?"

"అదేమిటి? సౌందర్యానికి సౌశీల్యం మెరుగుపెట్టిన ఉత్తమోత్తమ నమూనా భామ. నీకు అన్నివిధాలా అనురూపవతి. నువ్వు ఏనాడో చేసిన పూజకు ప్రతిఫలం!"

"నాకు కాదు నీకు ఆమె అన్ని




విధాలా తగినదేనా అని నేనడుగుతున్నాను."

"ఛీ, నీకు భార్యయైనది నాకు అనుకూలమేమిటి?"

"అలాగే నాకు నేనూ అనుకొంటున్నాను. నీకు భార్యకావలసిన భామ... శివ శివా! ... నాకు భార్యగా లోకుల యెదుట ధృవపడింది. ఇంతకంటె నీచమూ, ఇంతకంటె ఘోరమూ మరేముంటుంది?"

"రాయణీ, నిన్నేదో అనుమాన పిశాచం పట్టినట్టుంది! ప్రాణంలో ప్రాణంలా వుంటూన్న నామీద దురభిప్రాయపడుతున్నావ్! ఏనాటినుండి భామ నీకు దగ్గరకావడం మొదలెట్టిందో ఆనాటినుండీ నేను మీ యిద్దరికీ దూర దూరంగా ఉంటూవచ్చాను. వివాహబంధంతో మీరు పూర్తిగా కలిశారు. అందుకు నేను పూర్తిగా సంతోషించాను. లేనిపోని...అపోహలూ, అనుమానాలూ కల్పించుకొని నిన్ను నువ్వు నాశనం చేసుకోకు! భామ జీవితం ధ్వంసం చెయ్యకు!"

"లేదు రాయలూ, నువ్వు ఉద్రేకపడకు. అనుమానం, అపోహ నాకేమీ లేదు. మా వివాహం ఒక దుస్సంఘటన. మా యిద్దరి జీవితాలూ సర్వనాశనం కావడానికి అది పెద్దలచే నిర్ణయించబడిన ముహూర్తం! మాకు మేమే కోరి వేర్చుకున్న చిలి మా ప్రేమకలాపం! వివాహమై, మొదటిరాత్రి ఏకాంత మందిరంలో ప్రవేశించాకగాని, మా యదార్థసంబంధాలు బయటపడలేదు."

"ఏమిటిరా నువ్వనేది?ఏంజరిగింది?"

"ఏమీ జరగలేదనీ, భామా, నేనూ నిష్కళంకంగా ఉన్నామనీ నేను ప్రమాణంచేసి చెప్తున్నాను; నువ్వు నమ్మగలవా?"

"భార్యాభర్తలైనవాళ్ళకి దురవస్థ యెందుకురా?"

"ఆ మాట నువ్వంటూన్నప్పుడల్లా నా గుండెలమీద గునపంతో పొడిచినట్లుం

టోంది! నా మాటమీద నమ్మకముందా, అది చెప్పు!"

"నీకూ నాకూ మధ్యఅపనమ్మకమూ, అవిశ్వాసమూ, అసత్యమూ అనేవి ఇంత వరకూ లేవు. ఇక ముందుకూడా ఉండవు."

"ఐతే విను; సత్యభామ నా చెల్లెలు. మేమిద్దరం ఏక గర్భజన్ములం. బాగా చిన్నతనంలో మా నాన్నగారు నన్ను వెంటబెట్టుకొని బొంబాయిలో మీ యింటికి రావడం ఆ తరువాత ఆయన స్వర్గస్థులుకావడం నేను మీ కుటుంబంలో ఒకడుగా స్థిరపడిపోవడం నీకు తెలిసి నదే. మేము యిల్లు విడిచాక ఒక సంవత్సరంపాటు మాకోసం యెదురు చూచిందిట మా అమ్మ. ఆ సంవత్సర కాలంలో దివాణం భవనాలు సహితం అప్పులవాళ్ళు వేలం వేయించివేశారుట. ఇంక అక్కడ నిలువ నీడలేక మాఅమ్మ తన వంటినున్న బంగారంతోనువిలువైన సామానులు అమ్మగా వచ్చిన డబ్బుతోను మా చెల్లెలు, యీ భామని వెంట బెట్టుకొని తన అన్నగారైన ఈ సూపర్నెంటుగారి ఆశ్రయం పొందిందిట. ఈ సూపర్నెంటుగారు మా మేనమామ. వీరి మేనకోడలు, సత్యభామ నా స్వంత చెల్లెలు. మీనాక్షిదేవిగారు మా అమ్మ. మా కుటుంబాలలో యింకా పట్టుకొని వ్రేలాడుతూన్న ఘోషా సాంప్రదాయం, నేను రఘుపతిరాయలగారి మేనల్లుడుగా చెలామణీ కావడం, కొంతవరకూ ఈ ప్రమాదానికి కారణమైంది. నాలుగేళ్ల వయస్సులో రాష్ట్రానికే దూరమైపోయిన నేను మా చెల్లెల్నిగాని, మాఅమ్మనిగాని గుర్తించలేకపోయాను. వాళ్ళూ నన్ను గుర్తించలేకపోయారు "

ఆందోళనతోను, ఆశ్చర్యంతోను ఉక్కిరి బిక్కిరౌతున్న రాయలు "ఐతే ఇప్పుడెలా బయటపడిందీ విషయం?" అని అడిగాడు.

"రాయలూ, ఎంత కఠినమైనదైనా, ఎంత బాధను కలిగించేదైనా జరిగిన యదార్థం నీకు చెప్పక తప్పదు. వివాహమైన మొదటిరాత్రి మేము నూతన దంపతులం, చాలా రోజులనుండిప్రేమలు పెంచుకున్న ప్రేయసీ ప్రియులం. మాలో ఉరకలువేసే నవయౌవన వాంఛలు ఎలా వుంటాయో నువ్వుచాలా వరకూ ఊహించగలవు. మోహావేశంలో మేము గాఢంగా కౌవలించుకొనే సమయంలో ఆమె వక్షంమీద పమిటలోపల వ్రేలాడుతున్న బంగారు పతకం ఆమెకు గ్రుచ్చుకుంది. "అబ్బా!" అని నన్ను వదలించుకొని ఎడంగా తొలిగింది జారిపోయిన పమిటకొంగు నా చేతిలోవుంది. పతకం తళుక్కున మెరిసింది. సరిగా దానిని పోలిన పతకం నాదగ్గరకూడా ఉండడంవల్ల నా హృదయం కలుక్కుమంది. భయ సందేహాలతో పతకంతీసి యిమ్మన్నాను. పెట్టెలోవున్న నాపతకం



తీసి రెండింటినీ దగ్గర పెట్టిపరిశీలించాను. పతకాలు విడదీసి వాటి లోపలవున్న శ్రీ వీరవెంకట సత్యనారాయణస్వామి వారి బీజాక్షరాలుగల రక్షరేకులు చూచాను. రెండింటికీ ఏమీ తేడాలేదు. మా వంశంలోని వారందరూ అటువంటి పతకాల్ని ధరించడం మా వంశాచారం. ఇది తెలిసిన నేను భామ పుట్టుపూర్వోత్త రాలన్నీ అడిగాను. సత్యభామ నా చెల్లెలని ధృవపడింది. కంగారుపడిపోతూ అయోమయంగా చూస్తూన్న భామకి విషయమంతా చెప్పాను. మా జీవితాలకి తలిగిన యీ అఘాతానికి యిద్దరం యేడ్చాము. ఈ సంగతి అమ్మతో చెప్తానని బయలుదేరింది భామ. ఈ స్థితిలో యీ రహస్యం అందరికీ తెలిస్తే మా జీవితాలేమౌతాయంటావ్? నా మాట కేంగాని భామకి యీ జన్మలో మళ్లీ పెళ్ళయే అవకాశముంటుందంటావా?"

దీర్ఘంగా నిట్టూర్చి రాయలు "ఉండదు. లోకులు కాకులు. మీ కథ చిలవలూ పలవలూ పెంచుకొనిఊరూరా వ్యాపిస్తుంది. యదార్థం గ్రహించి సాను భూతి చూపగలిగేటంతటి సంస్కారం మన సమాజాని కెక్కడుంది?" అన్నాడు.

"అది ఊహించిన నేను భామని వారించాను. రాబోయే కష్టనిష్ఠూరాలన్నీ విశదంగా చెప్పాను 'కొన్నాళ్ళు మనం యిలాగే రహస్యం బయటపడకుండా

నటిస్తే, ఈ కృత్రిమబంధంనుండి విముక్తిపొందే మార్గం దొరక్కపోదు'' అన్నాను. ఎంత చెప్పినా వినిపించుకోదే "నువ్వు నా అన్నవనీ, నేను నీకు చెల్లెలినీ తెలిసాక, ఛీ, ఛీ యిలా నటించడమా?'' అంటుంది బ్రతిమాలి బుజ్జగించి, మన జీవితాలు మన చేజేతులా నాశనం చేసుకోకూడదని నచ్చజెప్పి చివరికి ఒప్పించాను. మాకు దినమొక యుగంగా గడుస్తోంది రాయలూ, నువ్వే తల్చుకుంటే మా బ్రతుకులు బాగుపడతాయి లేకపోతే మేమిద్దరం ఆత్మహత్య చేసుకోడం మినహా మరి మార్గంలేదు?" అని గద్గద కంఠంతో చెప్పాడు రాయణి.

విషమ పరిస్థితిని పూర్తిగా అవగాహన చేసుకున్నాడు రాయలు జరిగిన దుస్సంఘటనకి చింతించాడు. రాయణి సత్యభామల అవస్థకి సానుభూతి కలిగింది. ''మీ బ్రతుకులు బాగుపడ్డానికి నన్నేం చెయ్యమన్నా చేస్తానురా! నీ బాగు నా బాగు కాదా? నీ బాధ నాది కాదా? ఈ విషయాన్ని యిన్నాళ్లూ మనస్సులో పెట్టుకొని దిగులుతో బాధపడతావా? నీకు తెలిసిన మరుక్షణం నాతో చెప్తే ఏదో మార్గం యీపాటికి కనిపెట్టలేకపోయామా? ఎంతపని చేశావురా!'' అన్నాడు.

"జరిగినదేదో జరిగింది. ఇంక జరగవలసిందానికి జాగ్రత్తగా కట్టుదిట్టమైన ప్లానువేసుకొని దాని ప్రకారం అతి రహస్యంగా కార్యక్రమం నడుపుకోవాలి దీనికో కమలాక్షి సహాయంకూడా మనకి కావాలి అంతా సఫలమయాక మన వాళ్ళందరికీ తెలియాలి" అన్నాడు రాయణి

''ఆఁ, కమలాక్షి యెందుకూ?"

"భయపడకు; నిన్ను పెళ్లాడ్డానికి కాదులే!"

చెప్పరా నాయనా నానేసి సాగదియ్యక!"

రాయణీ, రాయలూ బాగా చీకటి పడేవరకూ తోటలోనే కూర్చుని ఒక పథకం రూపొందించుకొన్నారు. ఆ తరువాత యింటికి చేరారు.

ఆ మరునాడు రాయణి, రాయలు, సత్యభామ, కమలాక్షి నలుగురూ వినోదయాత్రకనిచెప్పి నగరానికి బయలుదేరి వెళ్ళారు. వాళ్ల ఊళ్లోకి షుమారు రెండు వందల మైళ్లదూరంలో వున్న నగరం వెళ్ళి తిరిగి రావడానికి వాళ్ళకి నాలుగు రోజులు పట్టింది. ఐదోనాడు ఉల్లాసంగా నూతన వస్త్రాలు ధరించి వరమాలలు అలంకరించుకొని వివాహ తిలకాలు పెట్టుకొని నూతన వధూవరుల రూపంలో సూపర్నెంటుగారి యెదుట ప్రత్యక్షమయారు రఘుపతిరాయలుగారికి వెంటనే నందనవనం రావలసినదని ముందుగానే కబురుపెట్టారు. రాయణి కమలాక్షి

చేతులు కలుపుకొని నిలబడ్డారు. అలాగే రాయలు, సత్యభామ చేతులు కలుపుకొని నిలబడ్డారు.

"ఇదేమిటి ? ఈ వేషాలేమిటి ? మీరిద్దరూ, మీరిద్దరూ చేతులు కలిపారేమిటి?" అంటూ ఆశ్చర్యంతోను, ఆందోళనతోను పెద్దవాళ్లు ప్రశ్నలవర్షం కురిపించారు. రాయణి తనకీ సత్యభామకీ సంబంధించిన విషాదగాథనంతాస్పష్టంగా వివరించాడు.

"ఆ క్లిష్టసమయంలో మా నిజరూపాలు బయటపడితే మా యిద్దరి జీవితాలూ నాశనమౌతాయనే భయంతో అంతా రహస్యంగా వుంచాము. విధిలేక ఆత్మవంచన చేసుకొని దంపతుల్లాగే పదిరోజులు నటించాం తరువాత రాయలు సహృదయత మమ్మల్ని కాపాడింది భామని తాను వివాహం చేసుకోడానికి సమ్మతించాడు కమలాక్షి కనికరించి నాతో వివాహానికి సమ్మతించింది నేనూ భామా మాకేర్పడిన అక్రమ సంబంధానికి కోర్టులో విడాకులిచ్చుకున్నాం. పిమ్మట మేము నిర్ణయించుకున్నట్టుగా రిజిస్టరీ వివాహాలు చేసుకున్నాం. దైవికంగా సంభవించిన క్లిష్ట పరిస్థితినుండి విముక్తి పొందడానికి, మీకెవరికీ తెలియకుండా మేమీ సాహసం చెయ్యవలసి వచ్చింది మమ్మల్ని మన్నించి ఆశీర్వదించండి.

నూతనదంపతులు సూపర్నెంటుగారు రఘుపతిరాయలుగారు మొదలైన పెద్దలందరికీ పాదాభివందనం చేశారు. వారంతా ఆశ్చర్యంతోను విషాదంతోను ఏమీ మాట్లాడలేక చేతుల చేష్టలతో మాత్రం ఆశీర్వదించారు.

మీనాక్షీదేవి మాత్రం భర్తమరణానికి దుఃఖిస్తూ వేరుగా గోడచాటున ఉంది ఉద్రిక్తవాతావరణం కొంత ఉపశమించాక నూతన వధూవరులు నలుగురూ అమెచుట్టూ కూర్చుని ఓదార్చారు రాయణిని దగ్గరకు చేర్చుకొని మీనాక్షీదేవి వలవల యేడ్చింది. వాని వీపునిమురుతూ "నాయనా, జరిగినదేదో జరిగిపోయింది. ఇంక కమలాక్షి నీ భార్య; భామ నీ చెల్లెలు, ఈ భావాన్ని మాత్రం ఇంక చెదరనీయకు. నిజస్థితి తెలియక మీరు తికమక పడిపోయి అనేకవిధాల అవస్థలుపడ్డారు. ఇంకనైనా మనస్సులు కుదుటబరచుకొని సుఖంగా వర్ధిల్లండి!" అంది.

''ఇంకా నిజస్థితి అంటావేమిటమ్మా? యదార్థం వెల్లడైపోయింది కదా ?" అన్నాడు రాయణి

అంత దుఃఖంలోనూ కొంచెం నవ్వి "నువ్వు పుట్టిన మరుక్షణంనుంచీ నా పొత్తిళ్లలోచేరి నాలుగేళ్ళ వయస్సు వచ్చే వరకూ నా బిడ్డలాగే పెరిగావు ఇప్పుడింక భామకి అన్నవై, నా కొడుకువే అని చెప్పకోడానికి సందేహం లేకుండా చేసుకున్నావు! '

"ఆదేమిటమ్మా ? ఐతే నేను నీ కొడుకుని కానా? మరెవర్ని నేను ?" అన్నాడు ఆదుర్దాగా రాయణి

"ఎవరమ్మా? రాయణి నా స్వంత అన్నయ్యకాదూ?" అంది సత్యభామ

అక్కడున్నవారిలో చాలామంది వీరి సంభాషణ వింటూ నివ్వెరపోయారు.

"కాదంటున్నానా ? అక్షరాలా ఇప్పుడు నువ్వు నా కన్నబిడ్డవే! ఒకా నొకనాడు మాత్రం ఒక అమ్మ నిన్ను కని మరునిమిషంలో కన్నుమూసింది. ఆవిడ ఒక మిలిటరీ ఆఫీసరు భార్య. ఆయన సత్యభామ తండ్రిగారికి ప్రాణ స్నేహితులు. గర్భవతియైన భార్యను మాకు వప్పగించి ఆయన డ్యూటీకి వెళ్లి పోయారు. తరువాత రెండు మాసాలకి ఆయన యుద్ధంలో మరణించినదుర్వార్త మాకు చేరింది. ఆనాటినుండీ నువ్వు మా బిడ్డగానే ఆ నాలుగేళ్లూ పెరిగావు. ఆ మమకారంతోనే నీ పేరు చివర రాయణి అని మావంశచిహ్నం చేర్చాం. ఆ సమయంలోనే భామని నేనుకన్నాను. అదొక కథ! దాన్నింక పూర్తిగా మరచి పోవడం మనందరికీ మంచిది నాయనా!" అంది మీనాక్షిదేవి

అందరూ ఒకరి ముఖాలొకరు చూచు కున్నారు. అందరి కన్నులనుండి ఆనందాశ్రువులు రాలాయి. రాయణి మాత్రం ఖిన్నుడై కొంతసేపు తల వంచుకొని కూర్చున్నాడు.

"ఏం నాయనా, నన్ను అమ్మగాను, భామను నీ చెల్లెలుగానూ చూచుకుం టావా?" అంది మీనాక్షీదేవి.

వెంటనే రాయణి తలయెత్తి "అమ్మా నన్ను సందేహిస్తున్నావా? నువ్వు నా అమ్మవైనప్పుడు భామ నా చెల్లెలుగాక మరేమౌతుంది ? ఒక కథ విన్నంత మాత్రాన మనసు చెదిరిపోయేటంతటి దుర్బలుణ్ణి కానమ్మా!" అంటూ ఆమె చేతిని తన కళ్లకద్దుకున్నాడు.

"అమ్మా, మేమిద్దరం నీ పిల్లలమే నమ్మా!" అంటూ తల్లిని కౌగలించు కుంది సత్యభామ

సంభ్రమాశ్చర్యాలతోను, ఆనంద విషాదాలతోను నిండిన ఆ యింటి వాతా వరణం రకరకాల అగరుధూపాలు నింపు కున్నట్టు ఘుమఘుమలాడింది

